# ఈనాడు వరంగల్

మంగళవారం సెప్టెంబరు 1, 2026 5

సమీక్షలో పాల్గొన్న మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, ఎంపీలు వేం నరేందర్‌రెడ్డి, కడియం కావ్య, బలరాంనాయక్, ఎమ్మెల్యేలు రాంచంద్రునాయక్, మురళీనాయక్, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య

# విధుల్లో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించం

## అధికారులకు మంత్రి పొంగులేటి హెచ్చరిక

**ఈనాడు, వరంగల్ - మహబూబాబాద్, కేసముద్రం రూరల్, ఇనుగుర్తి, న్యూస్‌టుడే:** పారదర్శకంగా పనిచేసి ప్రజలకు మంచి చేసే అధికారులను ప్రోత్సహిస్తామని.. విధుల్లో తప్పు చేస్తే ఉపేక్షించేది లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. మహబూబాబాద్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఉమ్మడి వరంగల్ జిల్లా అధికారుల సమీక్షలో పొంగులేటి మాట్లాడారు. 22ఏ, భూవివాదాలపై సొంత నిర్ణయాలు తీసుకోవద్దని.. నిబంధనలకు విరుద్ధంగా ఉత్తర్వులు జారీ చేసి ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావద్దన్నారు. కార్యాలయాలకు పరిమితం కాకుండా కనీసం నెలలో ఒకటి, రెండుసార్లు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలని సూచించారు. సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంలోనూ పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. సర్వే ప్రక్రియలో ఆలస్యం తగదని.. ప్రైవేటు సర్వేలకు పరిమితమవుతూ ప్రభుత్వ సర్వేలకు హాజరుకాని లైసెన్స్‌డ్ సర్వేయర్లకు నోటీసులు జారీ చేయాలని మంత్రి ఆదేశించారు. సబ్‌రిజిస్ట్రార్లు చట్టానికి అనుగుణంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.

**డబ్బు వసూళ్లపై ఫిర్యాదులు..:** ఇందిరమ్మ ఇళ్లకు 5 కి.మీ పరిధిలో ఉచితంగా రవాణా చేసే ఇసుకకు ట్రాక్టర్ యజమానులు రూ.5 వేల చొప్పున వసూలు చేస్తున్నట్లు మంత్రి సమావేశంలో పేర్కొన్నారు. రవాణా ఛార్జీలను శాస్త్రీయంగా నిర్ణయించాలని సూచించారు. వాటిని బోర్డుల మీద ప్రదర్శించాలని కలెక్టర్లకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల నుంచి డబ్బు వసూలు చేసినట్లు ఫిర్యాదులొస్తే సమగ్ర విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మంత్రి సీతక్క, ఎంపీలు వేంనరేందర్‌రెడ్డి, బలరాంనాయక్, కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు రాంచంద్రునాయక్, మురళీనాయక్, యశస్వినిరెడ్డి, కడియం శ్రీహరి, దొంతి మాధవరెడ్డి, కేఆర్ నాగరాజు, నాయిని రాజేందర్‌రెడ్డి, రెవెన్యూశాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్, ఐఏఎస్ అధికారి రాజీవ్‌గాంధీ హనుమంతు, కలెక్టర్లు స్నేహ శబరీష్, చాహత్ బాజ్‌పాయ్, సత్యశారద, సందీప్‌కుమార్, రాహుల్ శర్మ, బోర్ఖాడే సహదేవ్‌రావు తదితరులు పాల్గొన్నారు. వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) సంధ్యారాణి, గృహనిర్మాణ ఇన్‌ఛార్జి పీడీ కృష్ణమూర్తిని మంత్రి సన్మానించారు.

● హైదరాబాద్ తరహాలో అల్పాదాయ వర్గాల కోసం ప్రభుత్వ, లబ్ధిదారుల వాటా ధనంతో వరంగల్‌లోనూ అపార్ట్‌మెంట్లు నిర్మిస్తామని మంత్రి ప్రకటించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధిలో 480, పశ్చిమ నియోజకవర్గంలో 480 ఫ్లాట్ల చొప్పున తొలుత నిర్మాణాలు చేపట్టేందుకు భూమిని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.

**అభివృద్ధి పనులకు శ్రీకారం..:** కేసముద్రంలో పలు అభివృద్ధి పనులకు మంత్రులు పొంగులేటి, సీతక్క, ఎంపీ వేంనరేందర్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు సోమవారం శ్రీకారం చుట్టారు. రూ.1.90 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్తు ఉపకేంద్రాన్ని ప్రారంభించారు. రూ.6.50 కోట్లతో నిర్మించనున్న పురపాలక సంఘ కార్యాలయ భవనాన్ని, ఇనుగుర్తి, దంతాలపల్లి, సీరోలు మండల కేంద్రాల్లో రూ.6.75 కోట్లతో నిర్మించనున్న రెవెన్యూ కార్యాలయాల భవనాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

సమీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, యశస్వినిరెడ్డి, మాధవరెడ్డి, కేఆర్ నాగరాజు, నాయిని రాజేందర్‌రెడ్డి, సత్యనారాయణరావు

# పాముల సంచారం.. వాకర్స్‌కు ప్రాణసంకటం

నర్సంపేటలోని మినీ స్టేడియంలో సరైన నిర్వహణ లేకపోవడంతో పాములు, విష పురుగుల సంచారం పెరిగింది. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో వందల మంది ప్రజలు, క్రీడాకారులు.. నడక, వ్యాయామం, క్రీడల సాధన కోసం ఇక్కడికి వస్తుంటారు. ప్రత్యేకంగా వాకింగ్ ట్రాక్ నిర్మించకపోవడంతో పాటు నడకదారి పొడవునా.. పిచ్చి మొక్కలు పెరగడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని సాధన చేస్తున్నారు. సోమవారం స్టేడియంలోని ఓపెన్ జిమ్ వద్ద సింథటిక్ ప్లాట్‌ఫాం కింద తాచుపాము కనిపించడంతో అక్కడున్న వారు భయంతో ప్లాట్‌ఫాం(మ్యాట్)లను తొలగించారు. ఆ సర్పం పక్కనే ఉన్న పొదల్లోకి వెళ్లింది. గతంలోనూ పాములు కనిపించాయని వాకర్స్ తెలిపారు.

– న్యూస్‌టుడే, నర్సంపేట గ్రామీణం

ఓపెన్ జిమ్ వద్ద తొలగించిన సింథటిక్ మ్యాట్లు

# జ్వరాల పంజా..!

## ఇంటింటా బాధితులు.. దోమల స్వైర విహారం

**ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే:** ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది జిల్లాలో వానలు తక్కువగా కురిసినా.. జ్వరాలు మాత్రం ఇంటింటా ప్రబలుతున్నాయి. గత పదిరోజుల్లో జ్వర బాధితుల సంఖ్య రెట్టింపు అయ్యింది. నగరంలో ప్రతి నలుగురిలో ఒకరు జ్వరం లేదా జలుబుతో బాధపడుతున్నారంటే అతిశయోక్తి కాదు. త్రినగరిలోని ఆటోనగర్, దేశాయిపేట, కరీమాబాద్, కీర్తినగర్ కాలనీ, కాశీబుగ్గ, బాపూజీనగర్, న్యూశాయంపేట, కుమార్‌పల్లి తదితర ప్రాంతాల్లో జ్వర బాధితులు ఎక్కువగా ఉన్నారు.

**కార్పొరేషన్, న్యూస్‌టుడే:** వరంగల్ ప్రాంతంలో 48 డెంగీ కేసులు నమోదైనట్లు సమాచారం. ఉర్సు ప్రాంతంలో తొమ్మిదేళ్ల బాలిక, మరో మహిళ, వృద్ధుడికి డెంగీ సోకింది. కరీమాబాద్ ఎస్‌ఆర్‌ఆర్‌తోటలో మహిళ రెండువారాల పాటు ఆసుపత్రిలో చికిత్స పొందారు. చింతల్ ప్రాంతంలో ఒకే ఇంట్లో ఇద్దరు డెంగీ బారినపడ్డారు.

★ మలేరియా బారినపడి 2025లో 146 మంది, 2026లో ఇప్పటి వరకు 40 మంది వైద్యం కోసం ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నారు. డెంగీ బారినపడి 2025లో 448 మంది, 2026లో 56 మంది ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నారు.

### నివారణ చర్యలేవి..!

దోమల నివారణ వ్యవస్థ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కుంటుపడింది. ఒకప్పుడు ఇంటింటికి వెళ్లి రక్తపూతలు సేకరించేవారు. ఇది ఇప్పుడు ఎక్కడా కనిపించడం లేదు. ఆరోగ్య కేంద్రాల్లో ల్యాబ్ టెక్నీషియన్లు స్లైడ్స్ తీయకపోవడం, పరీక్షించడం లేదనే ఆరోపణలున్నాయి. ఏదైనా ఒక వీధిలో ఒకరికి మలేరియా పాజిటివ్ అని నిర్ధారణ అయితే ఆ ఇంటికి వెళ్లి సర్వే చేసి, దోమల నివారణ మందు ఆ ఇంటితో పాటు చుట్టూ 200 ఇళ్లకు గతంలో పిచికారీ చేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు.

నగరంలోని ఓ ప్రాంతంలో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది. ఇది అంతటా జరగడం లేదు

### ఎంజీఎంలో ఇదీ పరిస్థితి..

వివిధ ప్రాంతాల నుంచి ఎంజీఎం ఆసుపత్రికి జ్వరపీడితులు వస్తున్నారు. వీరికి జనరల్ మెడిసిన్ విభాగం వైద్యులు పరీక్షించి తగిన వైద్య పరీక్షలకు సిఫారసు చేస్తారు. ఈ పరీక్షల నివేదిక ఆధారంగా చికిత్స అందిస్తున్నారు. ప్రభుత్వ ప్రయోగశాలల్లో స్లైడ్స్ ఉపయోగించి మలేరియాను నిర్ధారిస్తుంటే.. ప్రైవేటు ల్యాబ్‌ల్లో ఆర్‌డీటీ పద్ధతిని పరీక్షిస్తున్నారు.

**సర్వే చేపట్టాం:** జిల్లాలో జ్వర సర్వే చేపట్టాం. క్షేత్రస్థాయిలో ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు జ్వర పీడితులను గుర్తించి.. సూచనలు చేస్తున్నారు. డెంగీ నిర్ధారణ అయిన వ్యక్తి కుటుంబ సభ్యులందరికి పరీక్షలు జరిపిస్తున్నాం. ఆ ఇంటితో పాటు చుట్టుపక్కల దోమల నివారణ పిచికారీ చేపడుతున్నాం. ఆ ప్రాంతంలో వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి డెంగీ, మలేరియా వ్యాధుల వ్యాప్తిని అరికడుతున్నాం. ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తు సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నాం. **– డా.రాజారెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి**

# సంచార జాతుల అభివృద్ధికి పథకాలు

ఫులే, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ డా.సత్యశారద, అధికారులు

**వరంగల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే:** సంచార, అర్ధ సంచార, విముక్తి జాతుల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని కలెక్టర్ డా.సత్యశారద అన్నారు. సంచార జాతుల విముక్తి దినోత్సవంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా మహాత్మా జ్యోతిరావు ఫులే, డా.బీఆర్. అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. బ్రిటీష్ పాలనలో క్రిమినల్ ట్రైబ్స్ యాక్ట్ కింద అనేక సంచార, అర్ధసంచార జాతులు అణచివేతకు గురయ్యారని వెల్లడించారు. అనంతరం ఆ చట్టం నుంచి విముక్తి కలిగించి.. డీ-నోటిఫైడ్ ట్రైబ్స్ (విముక్తి జాతులు)గా గుర్తించిన నేపథ్యంలో ఏటా ఆగస్టు 31న విముక్తి జాతుల దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అదనపు కలెక్టర్లు సంధ్యారాణి, వైవీ.గణేశ్, బీసీ అభివృద్ధి అధికారి పుష్పలత పాల్గొన్నారు.

# అద్దెకు కుడా భవనం

**కార్పొరేషన్, న్యూస్‌టుడే:** హనుమకొండలోని కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ(కుడా) కార్యాలయ భవనం అద్దెకు ఇచ్చేందుకు నిర్ణయించారు. 'కుడా' కార్యాలయాన్ని త్వరలోనే బాలసముద్రం కాళోజీ కళాక్షేత్రంలోని నూతన భవనంలోకి తరలించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. బాలసముద్రం స్థలాల అమ్మకాలపై కొత్త ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ నెల 10న 'కుడా' సమావేశ మందిరంలో ప్రీ-బిడ్ సమావేశం ఏర్పాటు చేశారు. ప్రైవేటు బిడ్డర్స్ నుంచి సలహాలు, సూచనలు స్వీకరిస్తారు.

హనుమకొండ నగర నడిబొడ్డున జేఎన్ స్టేడియం వెనకాల 'కుడా' కార్యాలయ భవనం ఉంది. మూడు అంతస్తులు, సుమారు 50 వేల చదరపు అడుగుల విస్తీర్ణం ఉంటుంది. గ్రౌండ్ ఫ్లోర్‌లో రాష్ట్ర మున్సిపల్ శాఖ, రాష్ట్ర పట్టణ ప్రణాళిక విభాగం ప్రాంతీయ కార్యాలయాలు కొనసాగుతున్నాయి. మొదటి, రెండో అంతస్తుల్లో 'కుడా' పరిపాలన కార్యాలయం, సమావేశ మందిరం ఉంది. అయిదేళ్ల క్రితం సుమారు రూ.2 కోట్ల పైచిలుకు నిధులతో కార్పొరేట్ కార్యాలయం తరహాలో ఆధునికీకరించారు. ఆదాయం కోసం ప్రైవేటు ఆసుపత్రులు, ఐటీ కంపెనీలు, విద్యా సంస్థలకు భవనాన్ని అద్దెకు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నారు.

**బాలసముద్రం స్థలాలపై కొత్త ప్రణాళిక:** ✦ బాలసముద్రంలోని స్థలాల అమ్మకాలపై కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ కొత్త ప్రణాళిక రూపొందించింది. గత జూన్‌లో నిర్వహించిన స్థలాల బహిరంగ వేలం రాజకీయ రగడ సృష్టించింది. కాంగ్రెస్, భారాసల మధ్య రాజకీయ బల ప్రదర్శనకు దారితీసింది. మొత్తం 8 ప్లాట్లకు వేలం నిర్వహించగా.. 6 ప్లాట్లు ప్రైవేటు వ్యక్తులు కొనుగోలుకు ముందుకువచ్చారు. కేవలం ఇద్దరు మాత్రమే మొత్తం డబ్బులు చెల్లించారు. నలుగురు ప్లాట్లు వద్దని వెనక్కి తగ్గారు. ✦ బాలసముద్రంలో సుమారు 8వేల గజాల స్థలాల వేలానికి ప్రైవేటు బిడ్డర్స్ నుంచి సలహాలు, సూచనలు తీసుకుంటారు. అన్నివర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ప్లాట్ల విస్తీర్ణం తగ్గించారు. 500, 600 గజాల ప్లాట్లు అమ్మకానికి కొత్తగా ప్రతిపాదించారు.

# పప్పుదినుసుల పంట పండింది

**హనుమకొండ వ్యవసాయం, న్యూస్‌టుడే:** ఎల్‌నినో ప్రభావంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో వరి సాగు బాగా తగ్గింది. ఈ నేపథ్యంలో రైతులు పప్పుదినుసుల సాగు వైపు మొగ్గు చూపారు. ఎక్కువగా కంది, పెసర, మినుములపై దృష్టి మళ్లించారు. గతేడాది వానాకాలంతో పోలిస్తే సాగు విపరీతంగా పెరిగింది.

ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సమృద్ధిగా కురవకపోవడంతో చెరువులు, కుంటల్లో నీరు లేకపోవడంతోపాటు పలు వాగుల మధ్యలోని చెక్‌డ్యాంలు సైతం ఎడారిని తలపిస్తున్నాయి. దీనికితోడు ఎస్సారెస్పీ, మిడ్‌మానేరు నుంచి నీళ్లు వదలకపోవడంతో కాల్వలు సైతం బోసిపోతున్నాయి. గతేడాది వరి పంట ఎక్కువగా సాగు కావడంతో పప్పుదినుసుల పంటలు అంతంత మాత్రంగానే సాగయ్యాయి. ఈ ఏడాది వరి సాగు తగ్గింది, రైతులు పప్పుదినుసుల సాగుపై ఆసక్తి చూపారు.

సాగు వివరాలు (ఎకరాల్లో) ● 2025/● 2026

| జిల్లా | కంది 2025 | కంది 2026 | పెసర 2025 | పెసర 2026 | మినుములు 2025 | మినుములు 2026 |
|---|---|---|---|---|---|---|
| వరంగల్ | 435 | 827 | 185 | 10,830 | 70 | 85 |
| హనుమకొండ | 268 | 1,625 | 127 | 2,556 | 0 | 47 |
| మహబూబాబాద్ | 400 | 2,623 | 1,728 | 21,489 | 38 | 1,200 |
| ములుగు | 78 | 50 | 30 | 51 | 51 | 39 |
| భూపాలపల్లి | 38 | 842 | 76 | 8,273 | 50 | 0 |
| జనగామ | 3,477 | 7,475 | 1,247 | 3,411 | 116 | 9 |

# దొడ్డు బియ్యం వేలానికి వేళాయె

## 2న ఆన్‌లైన్ టెండర్ల నిర్వహణ

### జిల్లాలో 847.356 మెట్రిక్ టన్నులు

**వరంగల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే:** రేషన్ దుకాణాలు, ఎంఎల్‌ఎస్ కేంద్రాల్లో నిల్వ చేసిన దొడ్డు బియ్యానికి వేలం వేయాలని పౌరసరఫరాలశాఖ నిర్ణయించింది. గత మార్చిలోనే కిలో బియ్యాన్ని రూ.21.60 చొప్పున విక్రయించేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలపడంతో.. పౌరసరఫరాలశాఖ టెండర్లు ఆహ్వానించింది. అయితే ఏడాదిన్నర కాలంగా నిల్వ ఉన్న బియ్యాన్ని ప్రభుత్వం నిర్ణయించిన బేస్ ధరకు కొనుగోలు చేసేందుకు ఎవరూ ముందుకు రాలేదని తెలిసింది. దీంతో జిల్లాల వారీగా టెండర్లు పిలిచి నిల్వ ఉన్న బియ్యాన్ని విక్రయించాలని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ జిల్లా అధికారులను ఆదేశించింది.

గతేడాది ఏప్రిల్ నుంచి ప్రభుత్వం సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తుంది. అయితే అప్పటికే రేషన్ దుకాణాల్లో నిల్వఉన్న దొడ్డు బియ్యాన్ని జిల్లాలోని ఎంఎల్‌ఎస్ కేంద్రాలకు తరలించారు. అయినా చాలావరకు దొడ్డుబియ్యం ఇంకా రేషన్ దుకాణాల్లోనే ఉంది. అయితే అక్కడ స్థలకొరత కారణంగా. అధ్వాన పరిస్థితుల్లో నిల్వ చేయడంతో పురుగులుపట్టి ముక్కిపోయే దశలో ఉన్నాయి.

గతేడాది ఏప్రిల్ నుంచి రేషన్ దుకాణాల్లో నిల్వ ఉన్న దొడ్డు బియ్యంతో పాటు అదనంగా స్టేజ్ 1, స్టేజ్ 2 గోదాముల్లో టన్నుల కొద్దీ బియ్యం నిల్వలున్నాయి. జిల్లాలో మొత్తం 847.356 మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యం నిల్వలున్నట్లు అధికారుల నివేదికల ద్వారా తెలుస్తోంది. ఒక్కో దుకాణంలో సుమారు 20 నుంచి 50 క్వింటాళ్ల వరకు నిల్వలున్నాయి. మొదట్లో దొడ్డు బియ్యం నిల్వలపై అధికారులు దృష్టిసారించినా.. ఆ తర్వాత గాలికొదిలేశారు. దీంతో చాలా మంది డీలర్లు దొడ్డుబియ్యాన్ని విక్రయించి సొమ్ము చేసుకున్నారు. ఈక్రమంలో వర్షాలకు నిల్వచేసిన బియ్యం వరదలో కొట్టుకుపోయిందని, ఎలుకలు, పందికొక్కుల పాలైందని నమ్మించేందుకు డీలర్లు శతవిధాలా యత్నిస్తున్నారు. ఇలా చేసిన ఒకరిద్దరిపై ఇప్పటికే 6ఏ కేసులు నమోదయ్యాయి.

గీసుకొండ మండలం ధర్మారంలోని రేషన్ దుకాణంలో నిల్వ ఉన్న దొడ్డు బియ్యం

### లేకపోతే.. డబ్బులు చెల్లించాల్సిందే..

దొడ్డుబియ్యం కొనుగోళ్ల కోసం సెప్టెంబర్ 2 వరకు ఆన్‌లైన్‌లో టెండర్లు దాఖలు చేసే అవకాశం కల్పించారు. ప్రభుత్వం నిర్ణయించిన బేస్ ధర కిలో రూ.21.60 కంటే ఎక్కువ కోట్ చేసిన వారికి టెండర్ దక్కుతుంది. అయితే డీలర్ల వద్ద నిల్వ చేసిన బియ్యం లేకపోతే.. టెండర్ దాఖలు చేసిన ధర ప్రకారం.. అంతే మొత్తాన్ని డీలర్లు చెల్లించాల్సి ఉంటుంది. లేదంటే అధికారులు డీలర్లపై కేసులు నమోదు చేసే అవకాశం ఉంది. మరోవైపు ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి, మిల్లుల్లో మరాడించి బియ్యంగా మార్చేందుకు కిలోకు సుమారు రూ.35 వరకు ఖర్చవుతోంది. అయితే నిల్వ ఉన్న బియ్యంపై సకాలంలో నిర్ణయం తీసుకోకపోవడంతో.. తక్కువ ధరకు విక్రయించాల్సిన పరిస్థితి వచ్చిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# విద్యుత్తు సమస్యల పరిష్కారానికి స్థానిక కోర్టులు

**సుబేదారి, న్యూస్‌టుడే:** విద్యుత్తు వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకు టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలో స్థానిక కోర్టులను ఏర్పాటు చేస్తున్నామని ఫోరం ఛైర్‌పర్సన్ నాగప్రసాద్ సోమవారం తెలిపారు. ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. సరఫరాలో అంతరాయం, విద్యుత్ హెచ్చుతగ్గులు, మీటర్లు, విద్యుత్ బిల్లుల్లో లోపాలు, సేవల్లో జాప్యం వంటి సమస్యలు తెలియజేయవచ్చని పేర్కొన్నారు. జనగామ సర్కిల్ పరిధిలోని జనగామ, దేవరుప్పుల సబ్‌డివిజన్ పరిధిలోని వినియోగదారులు సెప్టెంబరు 2న దేవరుప్పుల ఉపకేంద్రంలో దేవరుప్పుల, సింగరాజుపల్లె, లింగాలఘన్‌పూర్ మండలాలకు చెందినవారు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. వరంగల్ సర్కిల్ పరిధిలో నర్సంపేట డివిజన్, సబ్‌డివిజన్ పరిధిలోని నల్లబెల్లి, దుగ్గొండి, గిర్నిబావి, నర్సంపేట పట్టణంలోని వినియోగదారులు 8న నల్లబెల్లి ఉపకేంద్రంలో ఫిర్యాదు చేయాలన్నారు. మహబూబాబాద్ సర్కిల్ పరిధిలో తొర్రూరు, నెల్లికుదురు సబ్ డివిజన్ పరిధిలో మునిగాలవీడు సబ్‌స్టేషన్‌లో 17న లోకల్ కోర్టు ఉంటుందన్నారు.

# కంప్యూటర్ షట్‌డౌన్

## ప్రభుత్వ పాఠశాలల్లో బోధన కరవు

**వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే:** రెండేళ్ల క్రితం ప్రభుత్వ పాఠశాలల్లో కృత్రిమ మేధ (ఏఐ)పై అవగాహన కల్పించడానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ ఏడాది జూన్ 29న రాష్ట్ర విద్యా శాఖ డైరెక్టర్ డా.ఇ.నవీన్ నికోలస్ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్, కంప్యూటర్ బోధన, ఆధునిక సాంకేతిక నైపుణ్యాలు అందించడమే లక్ష్యంగా తీసుకున్న నిర్ణయం క్షేత్ర స్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు.

ఇన్‌స్ట్రక్టర్‌గా ఎంపికైన వారికి ఏజెన్సీ సంస్థ రెండు రోజులపాటు హైదరాబాద్‌లో బోధించే అంశాలపై శిక్షణ ఇచ్చి సిలబస్‌ను అందించింది. మొదటి మూడు రోజులు ఒక పాఠశాల, మరో మూడు రోజులు ఇంకో పాఠశాలలో 6-9 తరగతుల విద్యార్థులకు టైం టేబుల్ ప్రకారం బోధించాలి. కంప్యూటర్ ల్యాబ్‌లో ప్రయోగాత్మకంగా విద్యార్థులను తీర్చిదిద్దాలి.

### క్షేత్ర స్థాయిలో తీరిది

ప్రభుత్వ పాఠశాలల్లో ఏజెన్సీ సంస్థ చేపట్టిన నియామకానికి విరుద్ధంగా జరుగుతోంది. రెండు నెలలు గడుస్తున్నా కంప్యూటర్ బోధన అందడం లేదు. చాలా పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులు ఇన్‌స్ట్రక్టర్లను పాఠశాలల పనులకు ఉపయోగించుకుంటున్నారు. వారితో ఆ పాఠశాల ఉపాధ్యాయులు గైర్హాజరైతే ఆయా తరగతులను బోధించడం, మధ్యాహ్న భోజన వివరాలు, ఎఫ్‌ఆర్‌ఎస్, సమగ్ర శిక్ష, ఇతర పనులకు వాడుకుంటున్నారు. తాము చేయాల్సింది ఈ పనులు కావని బోధకులు హెచ్‌ఎంల దృష్టికి తీసుకెళ్లగా 'మేం చెప్పింది చేయాల్సిందేనని' హెచ్చరిస్తున్నట్లు వారు వాపోతున్నారు. ఇదే విషయమై ఏజెన్సీ నిర్వాహకులకు తెలియజేస్తే ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించి సూచిస్తామని ఉచిత సలహా ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు తమను చులకనగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్, డీఈవో ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.

### ఇదీ పరిస్థితి

☛ హనుమకొండ లష్కర్‌బజార్‌లోని ఓ ప్రభుత్వ పాఠశాలలో హెచ్‌ఎం ఇన్‌స్ట్రక్టర్‌తో కంప్యూటర్ బోధన చేయించకుండా ఇతర పనులు చేయిస్తున్నాడు. నెల రోజులు గడుస్తున్నా ఇంత వరకు టైం టేబుల్ తయారు చేయలేదు. కనీసం కంప్యూటర్ గది తెరవడం లేదు.

☛ హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న ఇన్‌స్ట్రక్టర్‌ను సెలవులో ఉన్న ఉపాధ్యాయుల తరగతులను బోధించమని చెబుతున్నారు.

☛ నగరంలో మచిలీబజార్, గోపాల్‌పూర్‌లోని పాఠశాలల్లో కంప్యూటర్లు, ల్యాబ్ సౌకర్యం లేదు. అక్కడ ఇద్దరు ఇన్‌స్ట్రక్టర్లను నియమించగా, వారు రెగ్యులర్‌గా విధులకు హాజరవుతున్నారు. కానీ కంప్యూటర్ విద్య బోధించడం లేదు.


## WALK-IN INTERVIEW

రెండు తెలుగు రాష్ట్రాలలో ఉన్న బల్క్‌డ్రగ్ పరిశ్రమ ప్రొడక్షన్ విభాగంలో పనిచేయుటకు ఈ క్రింది అర్హతలు, శారీరక దారుఢ్యం మరియు మంచి ఆరోగ్యం గల అభ్యర్థులు కావలెను.

2022 to 2026 PASSED OUT CANDIDATES

| Job Title | Qualification | | Stipend (P.M) |
|---|---|---|---|
| Trainee Helper | S.S.C , Inter / ITI (Fitter, Electrical, Diesel Mechanic) | | Rs. 15,000/- |
| Trainee Supervisor/ Graduate Apprentice | B.Sc (Chemistry/Microbiology) | Age 21 - 25 years | Rs. 18,000/- |
| | B.Pharmacy B.Tech (Chemical/Mechanical/ Electrical/ECE/CSE/EIE) | | Rs. 20,000/- |
| | M.Sc (Organic Chemistry/ Analytical Chemistry /Micro Biology) | | Rs. 22,000/- |
| | M.Pharmacy (Pharmaceutical Chemistry/ Analysis/QA/RA) | | Rs. 24,000/- |

పై అర్హతలు గల అభ్యర్థులు తమ బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్స్ మరియు జిరాక్స్ కాపీలను తీసుకొని ఈ క్రింది ప్రదేశాలలో జరుగు ఇంటర్వ్యూకు హాజరు కాగలరు. ఎంపిక కాబడిన అభ్యర్థులు షిఫ్టులలో పనిచేయవలసియుండును.

B.Com & B.Sc (Computers) Candidates are also eligible

| | |
|---|---|
| 03-09-2026 | ST. PETER'S INSTITUTE OF PHARMACEUTICAL SCIENCES Vidyanagar, HANUMAKONDA |
| 04-09-2026 | SAHASRA INSTITUTE OF PHARMACEUTICAL SCIENCES Near Ayyappa Swamy Temple, AREPALLY, Warangal |

Interview Time : 9:00 am to 03:00 pm

సదుపాయములు: 1.బ్యాచ్‌లర్స్‌కు (పురుషులు) ఉచిత వసతి 2.ఉచిత యూనిఫాం 3.అర్హులైన వారికి PF, ESI ఇవ్వబడును 4.భోజన ఖర్చులో రాయితీ

Issued by : SSM Manpower Services
Cyberhills Colony, PJR Nagar, Gachibowli, Hyderabad, Telangana.

Contact : 08694-257001


# ఉపాధి పనులకు ప్రణాళిక

## నేటి నుంచి ప్రత్యేక గ్రామసభల ఏర్పాటు

**దామెర, న్యూస్‌టుడే:** గ్రామాల్లోని కూలీలకు పని కల్పనే ధ్యేయంగా ప్రారంభమైన వీబీజీ రామ్‌జీ పథకంలో భాగంగా వికసిత్ భారత్-2047 లక్ష్యానికనుగుణంగా గ్రామీణాభివృద్ధిని సాధించేందుకు సెప్టెంబరు 1 నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించనున్నారు. గ్రామ పంచాయతీల వారీగా చేపట్టాల్సిన పనులను గుర్తించి, ప్రణాళికలు సిద్ధం చేయనున్నారు. వాస్తవ అవసరాలు, అందుబాటులోని వనరులు, మౌలిక వసతుల లోటుపాట్లను గుర్తించి, ప్రాధాన్యతా క్రమంలో పనులను రూపొందించే సమగ్ర ప్రణాళికను గ్రామసభలో రూపొందించనున్నారు.

### వివిధ శాఖల అనుసంధానం

వీబీజీ రామ్‌జీలో ప్రస్తుతం 22 శాఖలకు అనుసంధానం చేశారు. ఇందులో ప్రధానంగా పంచాయతీరాజ్, అటవీ, సెర్ప్, వ్యవసాయం, విద్య, మత్స్య, ఉద్యాన శాఖ, టీజీ రెడ్కో, డెయిరీ, గృహనిర్మాణ, సెరీకల్చర్, ఎస్బీఎం తదితర శాఖలను అనుసంధానం చేస్తూ పనులను కల్పించనున్నారు.

### గుర్తించాల్సిన విభాగాలు

వీబీజీ రామ్‌జీ పథకంలో భాగంగా 318 పనులను అధికారులు సూచిస్తున్నారు. కాగా వీటిని నాలుగు విభాగాలుగా విభజించారు. నీటి భద్రత (107), గ్రామీణ మౌలిక వసతులు (90), జీవనోపాధి మౌలిక వసతులు (86), విపత్తుల నివారణ (35)

జిల్లాల వారీగా గ్రామ పంచాయతీలు

| జిల్లా | గ్రామ పంచాయతీలు |
|---|---|
| వరంగల్ | 317 |
| హనుమకొండ | 210 |
| ములుగు | 174 |
| మహబూబాబాద్ | 482 |
| భూపాలపల్లి | 248 |
| జనగామ | 280 |

హనుమకొండ జిల్లా దామెరలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీవో

### తయారీకి మార్గదర్శకాలు

✦ ప్రతి గ్రామంలో ఎంపీడీవో లేదా ఏపీవో లేదా టీఏలు రథసారథులుగా బృందాల ఏర్పాటు, ప్రతి గ్రామంలో మొదటి, తుది గ్రామసభలు నిర్వహించాలి. ✦ మొదటి గ్రామసభలో వీబీజీ రామ్‌జీ ద్వారా కల్పించే పనులపై కూలీలకు అవగాహన కల్పించాలి. ✦ వివిధ శాఖల అధికారులందరూ విధిగా హాజరై తమ శాఖకు అవసరమైన పనులను గుర్తించి ప్రణాళికలో చేర్పించాలి. ఆయా పనులను జీపీఎస్ లొకేషన్ ఆధారంగా పరిశీలించాలి. ✦ తుది గ్రామసభలో గుర్తించిన పనులను ప్రాధాన్యతా క్రమంలో సూచిస్తూ వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికల ఆమోదం చేపట్టాలి. ✦ చివరి గ్రామసభలో ప్రతిపాదిత పని పేరు, లబ్ధిదారుడి వివరాలు, అంచనా వ్యయం, చేపట్టబోయే శాఖ, పనులు చేపట్టే ఆర్థిక సంవత్సరాన్ని రూపొందించాలి.


(c) eenadu

# మిరప నాటు.. సస్యరక్షణ చర్యలు

రైతేరాజు

**వెంకటాపూర్, న్యూస్‌టుడే:** వాణిజ్య సాగులో ప్రధానమైన పంట మిరప. ఉమ్మడి వరంగల్ జిల్లా రైతులు ఎక్కువ మిర్చి సాగుకు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే నారు పోసుకున్న రైతులు నాట్లు ప్రారంభించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు మిరప సాగుకు అనుకూలంగా ఉన్నాయి. కర్షకులు సైతం ఉత్సాహంగా సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. మిరప నాటే సమయంలో సరైన జాగ్రత్తలు పాటించకపోతే దిగుబడిపై ప్రభావం చూపుతుందని ఉద్యానశాఖ ములుగు డివిజన్ అధికారి జి. శ్రీకాంత్ 'రైతేరాజు'కు వివరించారు. మొక్కలు నాటే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యల గురించి వివరించారు.

**దుక్కిని ఇలా సిద్ధం చేయాలి..**

● వర్షాధారంగా నల్లరేగడి, నీటి వసతి ఉన్న చోట చెలకల్లో సైతం సాగుచేసుకోవడం కోసం వేసవిలో లోతు దుక్కులు చేసుకోవాలి. తొలకరి వర్షం కురవగానే పచ్చి రొట్ట ఎరువులైన జీలుగ, పెసర, జనుము, అలసంద జనుము లాంటివి వేయాలి. పూత దశకు రాగానే(45రోజులు) భూమిలో కలియదున్నడం మేలు. ● ఇదే సమయంలో ఎకరానికి 50 కిలోల సింగిల్ సూపర్ ఫాస్పేట్ చల్లుకోవాలి. 200 కిలోల వేప పిండి కూడా చల్లితే నేల ద్వారా సంక్రమించే వ్యాధులను నివారించవచ్చు. ● ఇలా సిద్ధం చేసిన నేలను రెండు మూడు సార్లు కలియదున్ని, నారు 30 నుంచి 40 రోజులు రాగానే ప్రధాన పొలంలో నాటుకోవాలి.

**నాటే సమయంలో జాగ్రత్తలు**

● ఎలాంటి పురుగు, తెగుళ్ల లక్షణాలు లేని బలమైన మొక్కలను మాత్రమే ఎంపిక చేసుకోవాలి. ● నేల పరీక్షల ఆధారంగా ఎరువులను, సేంద్రియ ఎరువులను వేయాలి. ● పొలంలో నీరు నిల్వ లేకుండా, వర్షం నీరు సాఫీగా బయటకు వెళ్లే విధంగా చూడడం మంచిది. ● నారు దెబ్బతినకుండా వేళ్లకు మట్టి అంటుకొని ఉండేలా చూడాలి. మొక్కల మధ్య 60, 40 సెం.మీటర్ల దూరం ఉండటం ఉత్తమం. ● మొక్కలను లోతుగా, పైపైన నాటొద్దు. నాటిన వెంటనే తేలికపాటి నీటి తడిని అందించాలి. ● ఉదయం, సాయంత్రం వేళల్లోనే నాటాలి. ఎండ సమయంలో దూరంగా ఉండటే మేలు. ● నాటిన కొన్ని రోజుల వరకు నేలలో తడి ఉండేలా చూసుకోవాలి. డ్రిప్ ద్వారా నీటి తడులు అందించాలి. ● నాటిన తర్వాత వారం వరకు చనిపోయిన, పురుగులు, తెగుళ్లు ఆశిస్తున్నాయో లేదో ప్రతిరోజూ పరిశీలించాలి.

## తక్కువ పెట్టుబడి.. ఎక్కువ రాబడి

**వెంకటాపురం, న్యూస్‌టుడే:** తక్కువ పెట్టుబడితో ఎక్కువ రాబడి వచ్చే కూరగాయల సాగు చేస్తూ.. లాభాలు ఆర్జిస్తున్నారు ములుగు జిల్లా వెంకటాపురం మండలం పాత్రాపురం గ్రామానికి చెందిన సదాపల్లి నాగేంద్రరావు. ఆటో నడుపుతూ జీవనం సాగించే ఈయన ప్రత్యామ్నాయ ఆదాయ వనరుపై దృష్టి సారించారు. ఇంటి పెరటిని కూరగాయల సాగుకు మలుచుకుంటే ఏడాది పొడవునా ఆదాయం పొందొచ్చని నిర్ణయించారు. తనకున్న 20 గుంటల భూమిలో బీర, కీర, అలసంద, చిక్కుడు, దొస, కాకర, వంగ, బెండ, మునగ పంటలు వేస్తున్నారు. హైబ్రిడ్ రకం విత్తనాలను కొనుగోలు చేసి తీగజాతి పంటకు పందిరి ఏర్పాటు చేశారు. సుమారు రూ.30 వేలు పెట్టుబడి పెట్టి జూన్‌లో విత్తనాలు విత్తారు. తీగజాతి పంటకు అవసరమైన ఏర్పాట్లు, ఎరువులు, పురుగు మందులు అదనంగా రూ.10 వేలు వెచ్చించారు. మూడు నెలల తర్వాత పంట చేతికి వస్తుండటంతో.. మార్కెట్లో విక్రయిస్తున్నారు. ప్రస్తుతం బీర, కీర రోజువారీగా 60 కేజీల దిగుబడి వస్తోంది. కొద్ది రోజుల్లోనే మిగతా పంటలు చేతికందనున్నాయి. వేసవి మినహా ఆర్నెళ్ల పాటు కూరగాయల సేద్యం చేసి సుమారు రూ.1.40 లక్షల ఆదాయం వచ్చినట్లు నాగేంద్రరావు 'రైతేరాజు'కు తెలిపారు. వాతావరణం అనుకూలించి, మార్కెట్లో ధరలు ఆశించిన స్థాయిలో ఉంటే కూరగాయల సేద్యానికి ఢోకా ఉండదన్నారు.

కూరగాయల తోటలో నాగేంద్రరావు

## వరి సాగు వివరాల నమోదు తప్పనిసరి

**మానుకోట, న్యూస్‌టుడే:** రాష్ట్ర ప్రభుత్వం సూచించిన వరి సాగు చేస్తున్న రైతులు తమ సాగు వివరాలను సెప్టెంబరు 10లోగా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని బయ్యారం మండల వ్యవసాయాధికారి రాజు తెలిపారు. తెలంగాణ సోనా(ఆర్‌ఎన్‌ఆర్ 15048), సాంబ మసూరి (బీపీటీ 5204), కేఎన్ఎం 1638, హెచ్‌ఎంటీ సోనా, జైశ్రీరామ్, డబ్ల్యూజీఎల్ 44, కేఎన్ఎం 7715 రకాల సన్న వరి ధాన్యానికి బోనస్ చెల్లిస్తారు. ఈ ఏడు రకాల విత్తనాలను కొనుగోలు చేసిన రైతుల పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, విత్తన కొనుగోలు రసీదుతో సంబంధిత విత్తన డీలర్లను సంప్రదించి పోర్టల్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలి. సొంత విత్తనాలు, ఇతర రైతుల నుంచి విత్తనాలు, పరిశోధన కేంద్రాలు, అనుమతించిన ఇతర వనరుల నుంచి విత్తనాలను పొందిన రైతులు సంబంధిత వ్యవసాయ విస్తరణాధికారి (ఏఈఓ) ద్వారా ప్రపత్రం సమర్పించి నమోదు చేసుకోవాలి. నమోదు చేసిన వివరాలను పౌర సరఫరాల శాఖకు అందజేస్తారు. నమోదు చేసుకున్న రైతులే వరి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించే దశలో రూ.500 బోనస్ పొందేందుకు అర్హులవుతారు.

### ప్రశ్న - సమాధానం

? వరిలో రెక్కల దోమ ఉద్ధృతి ఎక్కువగా ఉంది. నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటి? - **జి.సాంబయ్య, రైతు, వెంకటాపూర్**

✓ ప్రస్తుతం నెల రోజుల వరిలో రెక్కల దోమ ఉద్ధృతి ఎక్కువగా కనిపిస్తే ప్రొఫినోఫాస్ అనే రసాయనాన్ని లీటరు నీటికి 0.5 ఎంఎల్ చొప్పున పిచికారీ చేయాలని వెంకటాపూర్ మండల వ్యవసాయాధికారి శైలజ వివరించారు. **- న్యూస్‌టుడే, వెంకటాపూర్**

## గుమ్మడి.. లాభాలు దండి

**జఫర్‌గఢ్, న్యూస్‌టుడే:** ఏటా ఒకే రకమైన పంటల సాగుతో ఆశించిన ఫలితం ఉండటం లేదని ఓ రైతు వినూత్నంగా ఆలోచించారు. గుమ్మడి సాగు చేస్తూ లాభాలను ఆర్జిస్తున్నారు. జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం తమ్మడపల్లి(ఐ)కి చెందిన రైతు బుల్లె బీరయ్య కుటుంబ సభ్యుల సహకారంతో గత ఐదేళ్లుగా గుమ్మడిని సేద్యం చేస్తున్నారు. బీరయ్య తనకున్న 1.30 ఎకరాల విస్తీర్ణంలో గుమ్మడి సాగు చేపట్టారు. పెట్టుబడికి రూ. 50 వేలు వెచ్చించారు. వ్యవసాయ అధికారుల సూచనలతో సస్యరక్షణ చర్యలు చేపట్టారు. నాటిన వంద రోజుల తర్వాత దిగుబడి మొదలైంది. ఎకరానికి ఆరు టన్నుల కాయ వస్తుండగా, కిలోకి రూ.25 చొప్పున విక్రయిస్తున్నారు. ఎకరానికి పెట్టుబడి పోను రూ.80 వేలకు పైగా ఆదాయం సమకూరుతోంది. వివాహాది శుభకార్యాలు, గృహ ప్రవేశాలు, నూతన దుకాణాల ఏర్పాటు, తదితర కార్యక్రమాలకు గుమ్మడి కాయలను వినియోగిస్తుండటంతో.. మంచి లాభాలు వస్తున్నాయని బీరయ్య 'రైతేరాజు'కు తెలిపారు. వరంగల్, హైదరాబాద్, ఖమ్మం, సిరిసిల్ల, యాదాద్రి జిల్లాల్లో ఆర్డర్లపై కాయలను సరఫరా చేస్తున్నామని వివరించారు.

గుమ్మడి చేనులో బి. బీరయ్య

# నైపుణ్యమే పెట్టుబడి!

● యువతకు 'ఇండియా స్కిల్స్' పోటీలు

భూపాలపల్లి ఐటీఐ కళాశాలలో వృత్తి శిక్షణలో యువత

**భూపాలపల్లి, న్యూస్‌టుడే:** ఏ రంగంలోనైనా రాణించాలంటే ఆ రంగంపై పూర్తి పట్టు, నైపుణ్యం ఉండాల్సిందే. యువతలోని ఈ ప్రతిభను వెలికితీసి ఉపాధి అవకాశాలు పెంచడమే లక్ష్యంగా కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపక మంత్రిత్వ శాఖ 'ఇండియా స్కిల్స్ 2026-27' పోటీలను నిర్వహిస్తోంది. చదువుతో సంబంధం లేకుండా కేవలం వయస్సు, నైపుణ్యమే పెట్టుబడిగా ఎవరైనా ఈ పోటీల్లో పాల్గొనవచ్చు.

**ఏ అంశాల్లో పోటీలు నిర్వహిస్తారంటే..**

త్రీడీ డిజిటల్ గేమ్ ఆర్ట్, ఆటోమొబైల్ టెక్నాలజీ, బేకరీ, బ్యూటీ థెరపీ, కార్ పెయింటింగ్, కార్పెంటర్, క్లౌడ్ కంప్యూటింగ్, కుకింగ్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ ఇన్‌స్టాలేషన్స్, ఫ్యాషన్ టెక్నాలజీ, గ్రాఫిక్ డిజైన్, హెల్త్ సోషల్ కేర్, ఇండస్ట్రియల్ మెకానిక్ డిజైన్ టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్ అప్లికేషన్ డెవలప్‌మెంట్, జ్యువెల్లరీ, మొబైల్ అప్లికేషన్ డెవలప్‌మెంట్, పెయింటింగ్- డెకోరేటింగ్, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్ తదితర అంశాలు వ్యక్తిగత విభాగంలో ఉన్నాయి. మొబైల్ రోబోటిక్స్, కాంక్రీట్ కన్‌స్ట్రక్షన్ వర్క్, సైబర్ సెక్యూరిటీ, మెకట్రానిక్స్, రొబోట్ సిస్టమ్స్ ఇంటిగ్రేషన్, తదితర అంశాలు బృందాల వారీగా ఉంటాయి.

● స్కిల్ ఇండియా డిజిటల్ హబ్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీల్లో మొత్తం 63 అంశాలు ఉన్నాయి. వ్యక్తిగత విభాగంలో 56, బృందాల వారీగా ఏడు ఉన్నాయి. పోటీదారులు తాము తయారుచేసిన ప్రాజెక్టులు లేదా నమూనాలను ప్రత్యక్షంగా ప్రదర్శించాల్సి ఉంటుంది. విభాగాల వారీగా కొన్నింటికి 20 ఏళ్లు, మరికొన్నింటికి 23 ఏళ్ల లోపు వయసు ఉన్న యువతీయువకులు ఈ పోటీలకు అర్హులు. ఆసక్తి ఉన్న వారు ఆన్‌లైన్ ద్వారా www.skillindiadigital.gov.in వెబ్‌సైట్‌లో వివరాలు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి సెప్టెంబరు 15 వరకు గడవు ఉంది.

**ఈసారి జిల్లాస్థాయి నుంచే..**

గతేడాది అభ్యర్థులు తక్కువగా నమోదు చేసుకోవడంతో నేరుగా హైదరాబాద్‌లోనే రాష్ట్రస్థాయి పోటీలు జరిగాయి. కానీ ఈసారి పోటీదారుల సంఖ్యను బట్టి జిల్లాస్థాయి నుంచే పోటీలు జరపాలని అధికారులు నిర్ణయించారు. ఇందులో ప్రతిభ చూపిన వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తారు. విజేతలకు పతకాలు, బహుమతులు సైతం అందజేస్తారు.

**యువతకు మంచి అవకాశం**

యువతకు ఇది చక్కటి అవకాశం. 16 నుంచి 23 ఏళ్లు ఉన్న వారు స్కిల్ ఇండియా నిర్దేశించిన రంగాల్లో నైపుణ్యాలను వెలుగులోకి తేవచ్చు. ఉన్నత స్థాయిలో గుర్తింపు పొందవచ్చు. ఈ మేరకు ముందస్తుగా ప్రతి ఒక్కరు నమోదు చేసుకోవాలి. ఏదైనా సందేహాలుంటే ప్రభుత్వ ఐటీఐలలో సంప్రదించాలి. **- జూమ్లానాయక్, ఐటీఐ ప్రిన్సిపల్, భూపాలపల్లి**

## రేపు పరకాలకు భాజపా రాష్ట్ర అధ్యక్షుడి రాక

**పరకాల, న్యూస్‌టుడే:** భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు బుధవారం హనుమకొండ జిల్లా పరకాలకు రానున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్ తెలిపారు. సోమవారం ఇక్కడి కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు నిరంజన్ అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబరు 2వ తేదీన జరిగే అమర వీరుల సంస్మరణ దినోత్సవం కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ విజయ్‌కుమార్, పరకాల పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ రాజేందర్‌రెడ్డి, నాయకులు జయంత్ లాల్ మేఘనాథ్ పాల్గొన్నారు.

పరకాలలో మాట్లాడుతున్న సంతోష్‌కుమార్

## 7లోగా లక్నవరం నీటిని విడుదల చేయాలి

**పస్రా (గోవిందరావుపేట), న్యూస్‌టుడే:** ఆయకట్టుకు లక్నవరం జలాశయం నుంచి సెప్టెంబరు 7వ తేదీలోగా నీరు విడుదల చేయాలని రైతు కమిటీ ప్రతినిధులు తుమ్మల వెంకట్‌రెడ్డి, గొర్ల్యాల నర్సిరెడ్డి, మాచినేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని లక్నవరం జలాశయం ఆయకట్టు రైతులు సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో సమావేశమయ్యారు. 53 మందితో కమిటీ ఏర్పాటు చేసుకున్నారు. అనంతరం ప్రతినిధులు మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావం కారణంగా ఇప్పటి వరకు సరైన వర్షాలు లేకపోవడంతో పంటలు పూర్తిస్థాయిలో సాగు చేసుకోలేని పరిస్థితి ఉందని, లక్నవరం జలాశయం కింద వేల ఎకరాల్లో వరినాట్ల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు 60 శాతం నాట్లే పడ్డాయని, నీళ్లులేక అవికూడా ఎండిపోతున్నాయని చెప్పారు. ఆగస్టు 18న రైతు నాయకులతో సమావేశమైన కలెక్టర్ హేమంత్ బోర్ఖడే పరిస్థితి తీవ్రతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నీటిని విడుదల చేస్తామని హామీ ఇచ్చారని, ఇప్పటి వరకు విడుదల చేయలేదన్నారు. నీటి పారుదల శాఖ అధికారులు స్పందించకుంటే సెప్టెంబరు 10న జాతీయ రహదారిని దిగ్బంధిస్తామని హెచ్చరించారు. సమావేశంలో రైతు కమిటీ ప్రతినిధులు బి.దేవా నాయక్, జి.శ్రీనివాసరావు, వి.స్వామి, బి.మధు, బి.అశోక్, జి.రామస్వామి, ఎన్.సతీశ్, సీహెచ్. లింగారెడ్డి, టి.ఆగిరెడ్డి, ఎస్.సమ్మిరెడ్డి ఎం.సతీశ్, ఎం.తేజరాజు తదితరులు పాల్గొన్నారు.

**ఆలయ సమాచారం**

✦ భద్రకాళి ఆలయంలో మంగళవారం ఉదయం 5.30 గంటలకు అమ్మవారికి అభిషేకం, శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అభిషేకం ఉంటుంది. ఉదయం 9 గంటల నుంచి మహా మండపంలో విశిష్ట కుంకుమార్చనలు జరుగుతాయి. ఉదయం 7 నుంచి రాత్రి 8.30 గంటల వరకు సర్వ దర్శనాలు ఉంటాయి.

✦ హనుమకొండ వేయిస్తంభాల ఆలయంలో మంగళవారం ఉదయం 5.30 గంటల నుంచి సామూహిక రుద్రాభిషేకాలు జరుగుతాయి. శ్రావణమాసం ప్రత్యేక పూజలు ఉంటాయి. ఉదయం 6 గంటల నుంచి అర్చనలు. ఉదయం 7 నుంచి రాత్రి 8.30 గంటల వరకు సర్వ దర్శనాలు ఉంటాయి.

✦ హనుమకొండలోని చారిత్రక హనుమద్గిరి పద్మాక్షి దేవాలయంలో మంగళవారం ఉదయం 5:00 గంటలకు ప్రధాన దేవతామూర్తికి అభిషేకం ఉంటుంది. ఉదయం 7:00 గంటల వరకు మహా మంగళహారతి, 7:15 గంటల నుంచి కుంకుమార్చన, పుష్పార్చన నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12:30 గంటల వరకు భక్తులకు సర్వ దర్శనాలుంటాయి. సాయంత్రం 4 గంటల నుంచి 6:30 గంటల వరకు సర్వదర్శనం ఉంటుంది.

✦ కాళేశ్వర క్షేత్ర ఆదిముక్తీశ్వర బాలాలయంలో మంగళవారం ఉదయం 5.30 గంటలకు ద్విలింగాలకు మహాన్యాస రుద్రాభిషేకం, ఉదయం 8 నుంచి సామూహిక కాలసర్ప దోష నివరాణ, రాహువు కేతువు పూజలు, రూ.వెయ్యితో ప్రత్యేక అభిషేకాలు, 10.30 గంటలకు శుభానంద, ముక్తీశ్వర స్వామికి నిత్య కల్యాణం, రాత్రి 7 నుంచి జ్ఞాన సరస్వతీ ఘాట్ వద్ద కాళేశ్వరం అర్చకుల త్రిహారతి, రాత్రి 8 గంటలకు ఆలయ ద్వార బంధనం. - న్యూస్‌టుడే, రంగంపేట, వరంగల్ సాంస్కృతికం, కాళేశ్వరం

## ములుకనూర్ డెయిరీ పాల సేకరణ ధరల పెంపు

**భీమదేవరపల్లి, న్యూస్‌టుడే:** ములుకనూర్ మహిళా సహకార డెయిరీ సభ్యులు పాడి పశుపోషణపై ఆధారపడి పాల ఉత్పత్తిని పెంచుకొని ప్రధాన ఆర్థిక వనరుగా మార్చుకున్నారు. పాల ఉత్పత్తి పెరగడంతో మార్కెట్‌లో ఉన్న పోటీని దృష్టిలో పెట్టుకుని పాల సేకరణ ధరలను మంగళవారం నుంచి పెంచుతున్నట్లు డెయిరీ అధ్యక్షురాలు బుర్ర ధనశ్రీ, జీఎం మార్పాటి భాస్కర్‌రెడ్డి సోమవారం తెలిపారు. పెంచిన ధరలు లీటర్ ఆవు పాలు కనిష్ఠంగా 3 శాతం వెన్నకు రూ.37.38, గరిష్ఠంగా 4.9 శాతం వెన్న కలిగిన పాలకు రూ. 43.55 ధర నిర్ణయించినట్లు పేర్కొన్నారు. గేదె పాలకు కనిష్ఠంగా 5 శాతం వెన్న పాలకు రూ.44.50, గరిష్ఠంగా 15 శాతం వెన్న కలిగిన పాలకు రూ.133.50గా నిర్ణయించామన్నారు. సగటున ఆవు పాలకు రూ.1.25, గేదె పాలకు రూ.3.50 పెరిగిందన్నారు. ఈ ధరలు సెప్టెంబరు 1న ఉదయం నుంచి అమలులో ఉంటాయన్నారు. అలాగే పాల వ్యాపారంలో వచ్చిన లాభాలను సైతం సభ్యులకు బోనస్ రూపంలో పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. 50 కిలోల దాణా బస్తాకు రూ.125 రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు. పశుగ్రాసం విత్తనాలు 50 శాతం రాయితీ, పశువుల మందులు 25 శాతం రాయితీతోపాటు పాడి పశువులకు బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు వివరించారు. డెయిరీ సభ్యుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని సభ్యురాలు, ఆమె భర్త ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.75 వేలు, సహజ మరణానికి రూ.35 వేలు బీమా సదుపాయంతోపాటు అంత్యక్రియలకు రూ.7,500 చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు.

## 'ప్రతిపక్ష పార్టీల నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు'

**నయింనగర్, న్యూస్‌టుడే:** కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంటే, ప్రతిపక్ష భారాస, భాజపా నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం హనుమకొండ కాంగ్రెస్ భవన్‌లో టీపీసీసీ నేత బత్తిని శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులను మోసం చేసింది భారాస ప్రభుత్వమేనని, వారిపట్ల మొసలి కన్నీరు కార్చడం సరికాదన్నారు. ఉద్యోగులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం తెచ్చింది కాంగ్రెస్ అని, అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థులకు ఉపకార వేతనాలు, రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తున్నామని, గత ప్రభుత్వమే బకాయిలు చెల్లించలేదని విద్యార్థులు గమనించాలన్నారు. ఓరుగల్లు సమగ్ర అభివృద్ధికి సమష్టిగా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. భాజపా ఓరుగల్లుకు చేసింది శూన్యమని అన్నారు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, విమానాశ్రయం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేసిందన్నారు. ఆధునిక బస్టాండ్ నిర్మాణానికి పాటుపడుతోంటే అడ్డుకుంటున్నారని తెలిపారు. బండి సంజయ్ కుటుంబానికి రాజకీయ భిక్ష పెట్టింది కాంగ్రెసేనని, కేసీఆర్, చంద్రబాబు కాంగ్రెస్ నుంచి వచ్చినవారేనని గుర్తు చేశారు. అర్వింద్ ఓరుగల్లుకు వస్తే గుండు గీయించడం తప్పదన్నారు. పదేళ్లలో భారాస చేసిన అభివృద్ధి, రెండున్నరేళ్లలో కాంగ్రెస్ చేసిన అభివృద్ధిని ప్రజలు గమనిస్తున్నారని, రాబోవు కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలకు గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు పోతుల శ్రీమాన్, జక్కుల రవీందర్, మామిండ్ల రాజు, కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు సరళా, నాయకులు డా.రామకృష్ణ మార్క విజయ్‌గౌడ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, టీపీసీసీ నేతలు బత్తిని శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి

# త్రినగరి

## సేంద్రియ సాగును ప్రోత్సహించాలి

**రంగశాయిపేట, న్యూస్‌టుడే:** సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించి రసాయన రహిత పంటలను పండించాలని కర్ణాటక రాష్ట్ర యునైటెడ్ నేషన్స్ రిసోర్స్ సెంటర్ కో-ఆర్డినేటర్ బ్లెస్సినా డేనియల్ జోసెఫ్ సూచించారు. సోమవారం శంభునిపేట పీపుల్స్ మీడియేషన్ సెంటర్‌లో యునైటెడ్ నేషన్స్ తెలంగాణ రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా బ్లెస్సినా డేనియల్ జోసెఫ్ హాజరై మాట్లాడారు. కో-ఆర్డినేటర్ ధర్మపురి రాజగోవిందు, మండల పర్శరాములు, డా.బాల్నే సాంబమూర్తి, వడ్నాల నరేందర్, డా.కృష్ణారావు, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మొక్క నాటుతున్న బ్లెస్సినా డేనియల్ జోసెఫ్

## జాతీయస్థాయి పోటీలకు 'లక్ష్య' అథ్లెట్లు

**వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే:** జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఈనాడు 'లక్ష్య' అథ్లెట్లు ఎంపికయ్యారు. 21వ యూత్ నేషనల్స్ పంజాబ్ రాష్ట్రంలోని లుధియానాలోని గురునానక్ స్టేడియంలో సెప్టెంబరు 1 నుంచి 3వ తేదీ వరకు పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు అండర్-18 విభాగంలో అమూల్య, స్ఫూర్తి 3000 మీటర్ల రేస్‌వాక్, బన్నీ 110 మీటర్ల హర్డిల్స్ పరుగులో బరిలోకి దిగనున్నారు. హనుమకొండలోని 'లక్ష్య' కేంద్రంలో కోచ్ తిరుపతి వద్ద శిక్షణ పొందుతున్నారు. యూత్ నేషనల్స్‌లో పాల్గొనే తెలంగాణ అథ్లెటిక్స్ టీంకు తిరుపతి మేనేజర్‌గా వ్యవహరిస్తున్నారు. జాతీయ పోటీలకు ఎంపికైన ఈనాడు 'లక్ష్య' అథ్లెట్లను డీవైఎస్‌వో ప్రశాంత్, రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి సారంగపాణి సోమవారం అభినందించారు.

ఎంపికైన అథ్లెట్లతో కోచ్ తిరుపతి

## 2న పెద్ది సుదర్శన్‌రెడ్డి యాది సభ

**హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే:** పూర్వ ఐకాస ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుడు, దివంగత పెద్ది సుదర్శన్‌రెడ్డి యాది సభను ఈ నెల 2న హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహించనున్నారు. ఈమేరకు సోమవారం హనుమకొండలోని ప్రెస్ క్లబ్‌లో పూర్వ ఐకాస నాయకులు విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. సభకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ఐకాస సంఘాల ప్రతినిధులు కార్మిక, కర్షక, ప్రజా సంఘాల నాయకులను ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఐకాస నాయకులు మర్రి యాదవరెడ్డి, మాలోతు భిక్షపతి, సరోత్తంరెడ్డి, దినేశ్‌కుమార్, యాదగిరిరెడ్డి, రాజేష్, వెంకటరాములు పాల్గొన్నారు.

**చికెన్ ధరలు**

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

| | |
|---|---|
| ఫాం: | 122 |
| రిటైల్: | 149 |
| డ్రెస్డ్: | 231 |
| స్కిన్‌లెస్: | 261 |

EENADU Classifieds

REAL ESTATE

LAND FOR SALE

**జనగాం-హుస్నాబాద్ హైవే** దగ్గరలో 1.35 ఎకరం ఎర్ర నేల తూర్పు ఫేసింగ్‌తో 600ft పొడవు 150ft వెడల్పుతో బోర్ &జాలీ ఫెన్సింగ్‌తో అమ్మబడును.పౌల్ట్రీ ఫామ్స్/ ఏ ఫామ్ హైనా/ఏ తోటకైనా అనుకూలం. ✆ 8019095973.

JOBS

**Wanted Car** Driver and Ward boys for Balaji Hospital, Opp Ram Laxman Theater, SVN Road, Warangal. Contact 9502455663, 7989844760.

**రాఘవ ఆటో** ఫైనాన్షియర్స్ బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను NSPT-2, WGL-6, JNGM-4, TRR-2, MHBD-4 సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ JNGM-1, TRR-1 ✆ 9100902190, 9100902189.

**ప్రముఖ కొరియర్** సంస్థ డెలివరి లిమిటెడ్ హన్మకొండలో పనిచేయుటకు డెలివరి బాయ్స్ కావలెను జీతం 20,000-30,000 ✆6301945121,9989731552.

**వరంగల్ టౌన్‌లో** పని కలదు. కరుంగళి & అయ్యప్ప మాలలు మీ ఇంటవద్దనే తయారుచేసి ఇవ్వగలవారికి నేర్పించి పని ఇవ్వబడును. వీక్లీ పేమెంట్. ✆9391340755

FACULTY/ TEACHERS

**Wanted P.E.T** for a high school near Alankar, HNK. Ph: 9618130671, 7702994750

**నవోదయ కోచింగ్** సెంటర్‌లో పనిచేయుటకు లేడి వార్డెన్, అనుభవం గల మాథ్స్ ఫ్యాకల్టీ కావలెను. సంప్ర: భీమారం, HNK # 9963203554.

TO BOOK YOUR CLASSIFIED 5 lines Advt. B/W Rs. 430/- Colour Rs. 495/- only ★ GST 5% అదనం

For Advertisement Enquiry Please Contact to 80080 01791 80086 95558 80085 59193

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

## పోక్సో కేసు.. 20 ఏళ్ల జైలుశిక్ష

**సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే:** బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల పోక్సో కోర్టు న్యాయమూర్తి రాధికా జైశ్వాల్ సోమవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ మహేష్ బి.గితె తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం 2021లో తంగళ్లపల్లి ఠాణా పరిధిలోని ఓ బాలికపై జనగామకు చెందిన యటెల్లి విజయ్ లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై లక్ష్మారెడ్డి కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. కోర్టులో కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి.. నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష, జరిమానా విధించినట్లు తెలిపారు. మహిళల భద్రతకు పోలీస్ శాఖ ప్రాధాన్యం ఇస్తోందని, ఎవరైనా వేధింపులకు గురైతే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

## దొంగతనం కేసులో ఇద్దరి అరెస్టు

వివరాలు వెల్లడిస్తున్న సీఐ సురేశ్

**ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే:** ఎనుమాముల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ ఇంట్లో గతవారం దొంగతనానికి పాల్పడిన ఇద్దరిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సీఐ సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ ఆరెపల్లికి చెందిన ఎదులాపురం మంజు స్థానికంగా కిరాణ దుకాణం నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. గత సోమవారం ఇంటికి తాళం వేసి కుమారుడితో కలిసి దుకాణం వద్దే నిద్రించారు. మరుసటి రోజు ఇంటికి వెళ్లేసరి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. బీరువాలోని 15 గ్రాముల బంగారు నల్లపూసల గొలుసు, రూ.10వేల నగదు కనిపించకపోవడంతో ఎనుమాముల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం బాలాజీనగర్ జంక్షన్‌లో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా.. ఆటోలో వెళుతున్న వరంగల్ ఎంహెచ్ నగర్‌కు చెందిన ఊరడి అభిలాశ్, ఇసంపెల్లి లోకేశ్ అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా.. నల్లపూసల గొలుసు లభించింది. తాగుడుకి బానిసై జల్సాలకు అలవాటుపడి దొంతనానికి పాల్పడినట్లు అంగీకరించారు. బంగారం, నగదు స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

## జర్మనీ యూనివర్సిటీతో కేయూ ఒప్పందం

**కేయూ సర్కిల్, న్యూస్‌టుడే:** కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణా జర్మనీ పర్యటనలో భాగంగా అక్కడి రూట్లింగెన్ యూనివర్సిటీతో కాకతీయ యూనివర్సిటీ అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో అవగాహన ఒప్పంద పత్రాల మార్చుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ వీసీ ఆచార్య కుమార్ సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. జర్మనీలోని రూట్లింగెన్ యూనివర్సిటీకి చెందిన ఆచార్య బ్రూనే జోచెన్, స్టెఫాన్ డెగ్లెమాన్ ఆన్‌లైన్ ద్వారా కార్యక్రమంలో పాల్గొనగా, అవగాహన ఒప్పంద పత్రాలను పరస్పరం మార్చుకున్నారు. ఇందులో భాగంగా కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులు 3ప్లస్2 మాస్టర్స్ కోర్సు ద్వారా తమ ఉన్నత విద్యను జర్మనీలో కొనసాగించే అవకాశం పొందనున్నారు. ఇందులో మొదటి మూడేళ్ల విద్యను కేయూలో పూర్తి చేసి తర్వాత రెండేళ్ల మాస్టర్స్‌ను విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు డిగ్రీ అనంతరం రూట్లింగెన్ యూనివర్సిటీ మాస్టర్స్ డిగ్రీ ప్రదానం చేస్తుంది. ఈ కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం, ఓఎస్డీ వెంకట్రాంరెడ్డి, రూసా నోడల్ అధికారి ఆచార్య మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

జర్మనీ ప్రతినిధులతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంటున్న కేయూ వీసీ

## జనగణనలో ఓబీసీలకు ప్రత్యేక కోడ్ ఇవ్వాలి

**జులైవాడ, న్యూస్‌టుడే:** జనగణన శాస్త్రీయంగా, పారదర్శకంగా నిర్వహించాలని బీసీ ఉద్యమ నాయకుడు డాక్టర్ పరికిపండ్ల అశోక్ డిమాండు చేశారు. సోమవారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కులగణనలో ఓబీసీలకు ప్రత్యేక స్థానం ఇవ్వాలన్నారు. కేంద్రం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లోని ప్రశ్న నంబరు 10ని సవరించాలన్నారు. ప్రతి కులానికి ప్రత్యేక కోడ్ శాస్త్రీయ డ్రాప్‌డౌన్ విధానం అమలు చేయాలన్నారు. జనగణనతోపాటు కులగణన చేపట్టాలన్న కేంద్రం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు విద్యాసాగర్, మియాపురం శివుడు, చంద్రమౌళి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పరికిపండ్ల అశోక్

## వసతి గృహ బియ్యం పక్కదారి?

**హనుమకొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే:** హనుమకొండ బాలసముద్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు అందించాల్సిన బియ్యాన్ని ఆదివారం రాత్రి అక్రమంగా ఆటోలో తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నట్లు తెలిసింది. ఈ బియ్యాన్ని స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు. వసతి గృహ విద్యార్థినులకు చెందిన బియ్యాన్ని బయటకు ఎందుకు తరలిస్తున్నారు. ఎవరి ఆదేశాలతో తరలించారు. .. ఎంత మొత్తంలో తరలించారనే అంశాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. ఈ ఘటనపై జిల్లా ఎస్సీ సంక్షేమాధికారిణి నిర్మల సోమవారం వసతి గృహాన్ని సందర్శించి వివరాలు సేకరించి విచారణ చేపట్టినట్లు తెలిసింది. అనంతరం కలెక్టర్‌కు నివేదిక అందించి బాధ్యులపై చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం.

(c) eenadu

# పన్నులు కడుతున్నాం.. వసతులు కల్పించండి

కమిషనర్ వెంకన్నకు సమస్యలు వివరిస్తున్న కాలనీవాసులు

**కార్పొరేషన్, న్యూస్‌టుడే:** పన్నులు చెల్లిస్తున్నాం, కాలనీల్లో వసతులు కల్పించాలని వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లోని ప్రజలు కోరారు. కాలనీల్లో సీసీ రహదారులు, మురుగు కాలువలు, నీటి సరఫరా పైపులైన్లు వేయాలని, విద్యుత్తు స్తంభాలు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని గ్రేటర్ వరంగల్ కమిషనర్ వెంకన్నను కోరారు. సోమవారం బల్దియా సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణిలో 72 ఫిర్యాదులు వచ్చాయి. అందులో టౌన్‌ప్లానింగ్ విభాగానికి చెందినవి 27, ఇంజినీరింగ్ 21, పన్నులశాఖ 11, ప్రజారోగ్యం 9, నీటి సరఫరా సమస్యలపై 3, ఉద్యానశాఖ సంబంధించి ఒక అర్జీ వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని వింగ్ అధికారులను కమిషనర్ వెంకన్న ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, ఉప కమిషనర్లు ప్రసన్నరాణి, సమ్మయ్య, ఎస్ఈ రాజ్‌కుమార్, సిటీప్లానర్ రవీందర్ రాడేకర్ తదితరులు పాల్గొన్నారు.

### వరంగల్ పరిధిలోని వినతులు ఇవీ..

● 3వ డివిజన్ పైడిపల్లి శివారు కొత్తగూడెం కాలనీలో వీధిదీపాలు పనిచేయడం లేదు. ● రంగశాయిపేటలో మేర కమ్యూనిటీ హాలు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి. ● 21వ డివిజన్ ఎల్బీనగర్ హిందూ శ్మశానవాటిక అభివృద్ధి కోసం రూ.2 కోట్లు కేటాయించారు, పనులు మధ్యలో ఆపేయడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ● వరంగల్ బ్యాంకు కాలనీలో డ్రైనేజీలు నిర్మించాలి. ● 42వ డివిజన్ తెలంగాణ కాలనీలో నీటి సరఫరా పైపులైను ఏర్పాటు చేయండి. ● బల్దియా ప్రజావాణిలో వస్తున్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని సామాజిక కార్యకర్త లక్ష్మణ్ కమిషనర్‌ను కోరారు. ● 18వ డివిజన్ టీఆర్టీ కాలనీలో అంతర్గత రోడ్డు స్థలం సమస్య పరిష్కరించాలని వినతిపత్రం అందించారు.

# అర్జీలు సత్వరమే పరిష్కరించాలి

**వరంగల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే:** ప్రజావాణి అర్జీలను ప్రాధాన్య క్రమంలో సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ వై.గణేశ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణిలో వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన మొత్తం 136 అర్జీలను ఆయన స్వీకరించారు. అందులో రెవెన్యూశాఖ 42, జీడబ్ల్యూఎంసీ 26, గృహనిర్మాణశాఖ 21, డీఆర్డీవోకు 16 ఇతర శాఖలకు సంబంధించి 31 దరఖాస్తులు వచ్చినట్లు వెల్లడించారు. డీఎంహెచ్‌వో డా.రాజిరెడ్డి, డీఆర్డీవో నాగపద్మజ తదితరులున్నారు.

చిత్రంలో కనిపిస్తున్న దివ్యాంగుడి పేరు మాలోతు బాలాజీ. చెన్నారావుపేట మండలం అమీనాబాద్ నివాసి. ఈయనకు అమీనాబాద్ శివారులో 1.19 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. గత ప్రభుత్వం ధరణి పోర్టల్ తీసుకురావడంతో.. ఇతడి భూమి అన్యాక్రాంతమైంది. ఈ క్రమంలో రికార్డుల్లో పట్టా భూమిగా నమోదు చేయడానికి అధికారుల చుట్టూ తిరుగుతున్నా.. ఎలాంటి ఫలితం లేదని వాపోయారు.

### నీటిఎద్దడితో అల్లాడుతున్నాం..
- ఖిలా వరంగల్ అఖిలపక్ష పోరాట కమిటీ ప్రతినిధులు

ఖిలా వరంగల్ పడమర కోటలో సుమారు 15 వేల మంది జనాభా నివసిస్తోంది. కొంతకాలంగా ఇక్కడి ప్రజలు తీవ్ర నీటి ఎద్దడితో అల్లాడుతున్నారు. వారానికి ఒకరోజు మాత్రమే తాగునీరు సరఫరా అవుతోంది. అదీ రాత్రి సమయం కావడంతో.. తాగునీటి కోసం రాత్రంతా జాగారం చేయాల్సి వస్తోంది. ప్రతిరోజు తాగునీటి సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

### మేమున్నాం.. మీకు తోడుగా

99635 59929, 98484 09191, 89896 42307, 98496 21191 (10 AM TO 1 PM)

## ఫాగింగ్ చేశారు

**ఖిలావరంగల్, న్యూస్‌టుడే:** శివనగర్ శ్రీకృష్ణ కాలనీ, శ్రీరామకాలనీ ప్రాంతాల్లో ఫాగింగ్ చేశారు. దోమల స్వైర విహారంతో ఇబ్బందులు పడుతున్నామని, నివారణ చర్యలు చేపట్టాలంటూ.. స్థానిక ప్రజల ఫిర్యాదును శానిటరీ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ దృష్టికి తీసుకెళ్లాం.. స్పందించారు. వెంటనే మలేరియా విభాగం సిబ్బందితో ఫాగింగ్ చేయించారు.

## పిచ్చిమొక్కల తొలగింపు

**చెన్నారావుపేట, న్యూస్‌టుడే:** ఎల్లాయిగూడెం గ్రామం 7వ వార్డులోని అంతర్గత రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరిగి ఇబ్బందిగా మారిందని.. ఈ విషయాన్ని 'మేమున్నాం.. మీకుతోడుగా' ద్వారా పంచాయతీ కార్యదర్శి వికాస్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లాం.. స్పందన లభించింది. పంచాయతీ కార్మికులతో పిచ్చి మొక్కలను తొలగించారు.

## బాధిత కుటుంబానికి చేయూత

**చెన్నారావుపేట, న్యూస్‌టుడే:** పాతముగ్గుంపురం గ్రామానికి చెందిన కొండపల్లి కృష్ణమోహన్ రోడ్డు ప్రమాదంలో కాలు విరిగి మంచానికే పరిమితమయ్యాడు. ఈ విషయంపై 'ఈనాడు'లో గత నెల 30న 'కష్టాల్లో కుటుంబం' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన పలువురు కృష్ణమోహన్ కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్నారు. బెంగుళూర్‌కు చెందిన సాయిరాం అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూ.10,000, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చీరాలకు చెందిన రాజేష్ రూ.5000 ఫోన్ పే ద్వారా ఆర్థిక సహాయం అందించారు.

## ఆక్సిజన్ సిలిండర్ అందజేత

**రంగశాయిపేట, న్యూస్‌టుడే:** రెండు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న చింతకింది శ్రీనివాస్‌కు జనసేన పార్టీ జిల్లా నాయకుడు కొయ్యాడ ప్రభాకర్ సోమవారం ఆక్సిజన్ సిలిండర్‌ను అందజేశారు. ఈ నెల 2న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదినం సందర్భంగా 34వ డివిజన్ శివనగర్‌లో చైత్ర లఘు చిత్రం గోడపత్రికలు ఆవిష్కరించారు. లఘు చిత్రానికి వరంగల్ ప్రాంతానికి చెందిన మాటేటి సాయినాథ్ దర్శక, నిర్మాతగా వ్యవహరించారన్నారు. నాయకులు రాజేంద్రప్రసాద్, శివ కోటి, శివ, డేవిడ్, పృథ్వీరాజ్, రాజు, జునైద్ పాల్గొన్నారు.

## తగిన పత్రాలు సమర్పించి ఓటు పొందండి

**పర్వతగిరి:** 'సర్' ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లు తగిన గుర్తింపు పత్రాలను తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించాలని తహసీల్దార్ వెంకటస్వామి సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో నోటీసులు అందుకున్న వారి నుంచి పూర్తి వివరాలతో కూడిన పత్రాలను సోమవారం సిబ్బంది స్వీకరించారు.

## ఈఎస్ఐ ఆసుపత్రి ఎదుట అపరిశుభ్రత

వరంగల్ ప్రాంతీయ ఈఎస్ఐ ఆసుపత్రి ప్రధాన ద్వారం ముందు మురుగునీరు నిలిచింది. గొర్రెకుంట ప్రధాన రహదారిలో డ్రైనేజీ పూర్తిగా జామైంది. వ్యర్థాలు తొలగించక పోవడంతో మురుగునీరు ఈఎస్ఐ ఆసుపత్రి ఎదుట ప్రవహిస్తోంది. ఆసుపత్రికి వచ్చే వైద్యులు, ఉద్యోగులు, రోగులు ఇబ్బంది పడుతున్నారు. - న్యూస్‌టుడే, కార్పొరేషన్

## పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు అందిస్తాం

నల్లబెల్లిలో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

**నల్లబెల్లి, న్యూస్‌టుడే:** ప్రతి పేదకు ఇందిరమ్మ ఇల్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మాధవ రెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రంలో మాసంపెల్లి అఖిల్ దంపతుల నూతన ఇందిరమ్మ ఇంటిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సంక్షేమ ఫలాలు ప్రతి ఇంటికి పారదర్శకంగా అందిస్తామన్నారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## అభాగ్యులకు అండగా ప్రజా ప్రభుత్వం

బాధితులకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

**రాయపర్తి, న్యూస్‌టుడే:** ప్రజా ప్రభుత్వం పేద ప్రజలకు అండగా ఉంటుందని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన బాధితులు ఇటీవల ఆరోగ్య సమస్యలతో వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందారు. సోమవారం నియోజకవర్గ కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో బాధితులకు సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అందించారు. నాయకులు రవీందర్‌రెడ్డి, హమ్యా నాయక్, యాకన్న, కాశీ తదితరులు పాల్గొన్నారు.

## కొత్త రేషన్‌కార్డులు ఇచ్చిన ఘనత రాష్ట్ర సర్కారుదే

నర్సంపేటలో స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తున్న 'పుర' ఛైర్‌పర్సన్ శ్రీలక్ష్మి, కాంగ్రెస్ నాయకులు

**నర్సంపేట, న్యూస్‌టుడే:** పేదల అభ్యున్నతి కోసం సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం విప్లవాత్మక పథకాలను అమలు చేస్తోందని స్థానిక మున్సిపల్ ఛైర్‌పర్సన్ శ్రీలక్ష్మి తెలిపారు. నర్సంపేటలో వేర్వేరు నాలుగు చౌక దుకాణాల పరిధిలోని పేదలకు సోమవారం స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పదేళ్ల అధికారంలో ఉన్న భారాస ప్రభుత్వం కొత్తగా ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదన్నారు. ప్రజా ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయడమేగాక సన్న బియ్యం పంపిణీ చేస్తోందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ప్రసన్న, రెవెన్యూ అధికారులు, టీపీసీసీ సభ్యుడు రామానంద్, మాజీ మార్కెట్ యాకుబ్‌రెడ్డి, పార్టీ నాయకులు వీరకుమార్, సారంగం, శ్రీనివాస్‌గౌడ్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

104.8FM Warangal
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

| కార్యక్రమము | ప్రసార వేళలు |
|---|---|
| ఉషోదయం | ఉ॥ 5 - ఉ॥ 7 |
| ఈ-మార్నింగ్స్ | ఉ॥ 7 - ఉ॥ 11 |
| నువ్వా నేనా | ఉ॥ 11 - మ॥ 2 |
| సత్యభామ | మ॥ 2 - సా॥ 5 |
| లైట్ తీస్కో | సా॥ 5 - రా॥ 9 |
| సరదాగా కాసేపు | రా॥ 9 - రా॥ 12 |
| బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్ | రా॥ 12 - తె॥ 5 |

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180620, 9000180623

## పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

మహిళకు కళ్లజోడు పెడుతున్న ఎర్రబెల్లి రేణుక చిత్రంలో ప్రదీప్‌రావు

**రంగశాయిపేట, న్యూస్‌టుడే:** నిరుపేద ప్రజలకు మెరుగైన వైద్య సాయం అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. సోమవారం ఇసుక అడ్డా ప్రాంతంలోని ఓ వేడుకల మందిరంలో ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ ఎర్రబెల్లి వినీత్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శంకర కంటి హాస్పిటల్ సహకారంతో నిర్వహించిన వైద్య శిబిరంలో సుమారు 15 వందల మందికి ఆరోగ్య పరీక్షలు చేశారు. అందులో వెయ్యి మందికి పైగా కంటి అద్దాలు, వంద మందికి రెటీనా, ఇతర ఆపరేషన్ల చేసేందుకు హైదరాబాద్‌కు తరలించారు. మాజీ మేయర్ రాజేశ్వర్‌రావు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, రావుపద్మ, అశోక్‌రెడ్డి, వెంకటరమణ, డా.కాశీప్రసాద్, నిర్వాహకులు మందా శ్రీనివాస్, మహేష్, తిరుపతిరెడ్డి, హరిశంకర్ పాల్గొన్నారు.

## భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి

ఆర్డీవో కార్యాలయం ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**నర్సంపేట, న్యూస్‌టుడే:** పేదలకు చెందాల్సిన ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి పి.రమేశ్ డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ పరిధిలో మాదన్నపేట మార్గంలో సర్వే నంబరు 111/1/70లో నివాసం ఉంటున్న నిరుపేద ఒంటరి మహిళలను నిరాశ్రయులు చేసిన వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సోమవారం ఎంసీపీఐయూ నాయకులు ఆర్డీవో కార్యాలయం ఏవోకు వినతిపత్రం అందజేశారు. నర్సంపేటలో భూకబ్జాదారుల, రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఆగడాలు పెరిగి పోతున్నాయన్నారు. ఆ పార్టీ నాయకులు రాజమౌళి, సదానందం, యాదగిరి, సాంబయ్య, శ్రీనివాస్, నర్సయ్య పాల్గొన్నారు.

## 'ప్రగతి నివేదిక తప్పులతడక'

బల్దియా ప్రధాన కార్యాలయంలో సావనీర్ కాపీలను చించివేస్తున్న భారాస నేతలు

**రంగంపేట, న్యూస్‌టుడే:** వరంగల్ మహా నగరపాలక సంస్థ 2021-26 పాలకవర్గం అయిదేళ్ల ప్రగతి నివేదిక(సావనీర్) తప్పుల తడకగా ఉందని భారాస మాజీ కార్పొరేటర్లు మరుపల్ల రవి, రాధికారెడ్డి, రాజునాయక్, భారాస నాయకుడు మసూద్ ఆరోపించారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయం వద్ద సావనీర్ పుస్తకాలు చించేసి, దహనం చేశారు. అనంతరం కమిషనర్ వెంకన్నను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. మాజీ మేయర్ గుండు సుధారాణి ఏకపక్షంగా అయిదేళ్ల ప్రగతి నివేదిక తయారు చేయించారని ఆరోపించారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్, మాజీ ఎమ్మెల్యేల ఫొటోలు ఎందుకు తీసేశారని ప్రశ్నించారు. మాజీ మేయర్ నగరానికి చేసిందేమీ లేదని, అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు.

## కమిషనరేట్‌లో పోలీసు అధికారుల బదిలీ

**వరంగల్ క్రైం (హనుమకొండ), న్యూస్‌టుడే:** వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న పలువురు అధికారులను బదిలీ చేస్తూ సీపీ ఎస్.శ్వేత సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలిలా ఉన్నాయి.

| పేరు | ప్రస్తుత స్థానం | బదిలీ |
|---|---|---|
| ఎస్. శ్రీనివాస్ | వీఆర్, వరంగల్ | స్టేషన్‌ఘన్‌పూర్ |
| జి. వేణు | స్టేషన్‌ఘన్‌పూర్ | రఘునాథ్‌పల్లి (సీఐ) |
| ఎ. శ్రీనివాస్ | రఘునాథ్‌పల్లి | ఎస్‌బీ, వరంగల్ |
| పి. దేవేందర్ | టాస్క్‌ఫోర్స్ | నర్మెట్ట (సీఐ) |
| టి. రవికుమార్ | సీపీటీసీ | మహిళా ఠాణా-2 |
| ఎ. సువర్ణ | మహిళా ఠాణా-2 | సీసీఎస్ |
| పి. మంగీలాల్ | టాస్క్‌ఫోర్స్ | మిల్స్ కాలనీ అటాచ్ |
| భరత్ సుమన్ | వరంగల్ పోలీసు కమిషనరేట్ | పాలకుర్తి (సీఐ) |
| వి. జానకీరాంరెడ్డి | పాలకుర్తి (సీఐ) | ఎస్‌బీ, వరంగల్ |
| టి. కిరణ్ | వరంగల్ పోలీసు కమిషనరేట్ | పీసీఆర్, వరంగల్ అటాచ్డ్ ఐటీ కోర్ |
| ఎ. ప్రవీణ్‌కుమార్ | ఐటీ కోర్ | పరకాల |
| వి. క్రాంతికుమార్ | పరకాల | టాస్క్‌ఫోర్స్ |
| జి. బాబులాల్ | టాస్క్‌ఫోర్స్ | ఆత్మకూరు |
| బి. రాజ్‌గోపాల్ | పర్వతగిరి (సీఐ) | టాస్క్‌ఫోర్స్ |
| కె. శ్రీను | వీఆర్, వరంగల్ | ఎల్కతుర్తి (సీఐ) |
| పి. రమేష్ | ఎల్కతుర్తి | మహిళా ఠాణా-1 |
| కె. సూర్యప్రసాద్ | మహిళా ఠాణా-1 | సీటీసీ, వరంగల్ |
| కె. సాయిరమణ | వీఆర్ | ఎస్‌బీ, డ్రగ్ కంట్రోల్ టీం |
| వై. సంజీవరావు | సీసీఆర్‌బీ | వర్ధన్నపేట (సీఐ) |
| కె. శ్రీనివాస్ | వర్ధన్నపేట | సీసీఆర్ |
| ఆర్. సంతోష్ | ఆత్మకూరు | పర్వతగిరి (సీఐ) |
| ఎ. శ్రీనివాస్ | వరంగల్ కమిషనరేట్ | ధర్మసాగర్ |

# తీరు మారకపోతే కఠిన చర్యలు

### 'ఈనాడు' కథనాలపై కమిషనర్ ఆరా

**కార్పొరేషన్, న్యూస్‌టుడే:** గ్రేటర్ వరంగల్ పన్నుల విభాగం ఉద్యోగులకు ఇదే చివరి హెచ్చరిక, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు(ఆర్‌ఐలు), బిల్ కలెక్టర్లు, వార్డు అధికారుల తీరు మారకపోతే సస్పెండ్ చేస్తానని కమిషనర్ వెంకన్న హెచ్చరించారు. సోమవారం 'ఈనాడు'లో 'పైసలిస్తేనే పని.. పన్నుల విభాగం తీరిది' శీర్షికతో ప్రచురితమైన కథనంపై కమిషనర్ ఆరా తీశారు బల్దియా సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం ముగిసిన తర్వాత కమిషనర్ అంతర్గత సమావేశం నిర్వహించారు. ఎనుమాముల ఖాళీ స్థలం ఇంటినంబర్ల కేటాయింపు వివాదంపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. గతంలో పనిచేసిన ఆర్‌ఐలు ఎవరు?, ఇంటి నంబర్లు ఎలా కేటాయించారు?, తదితర అంశాలపై విచారణ చేపట్టాలని అదనపు కమిషనర్ జోనాను కోరారు. కొత్త ఇంటి నంబర్ల కేటాయింపు సమయంలో సంబంధిత భవనం, షెడ్డు నిర్మాణ స్థలాన్ని జియో ట్యాగింగ్ చేయాలని, స్థానిక ఆర్‌ఐ, బిల్‌కలెక్టర్, వార్డు అధికారి బృంద చిత్రం దస్త్రానికి జతపర్చాలన్నారు. కిందిస్థాయి ఉద్యోగులు తప్పులు చేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారని కమిషనర్ నిలదీశారు. ఉప కమిషనర్లు, టీవో, ఆర్వోల తీరుపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇంజినీర్లతో సమావేశమైన కమిషనర్ వెంకన్న

### నీటి సరఫరాపై సమావేశం

ఖిలా వరంగల్ పడమరకోటలో నీటి సరఫరా అంతరాయానికి కారణాలేమిటి?, స్థానిక సమస్యలేమిటని కమిషనర్ వెంకన్న ఆరా తీశారు. సోమవారం 'ఈనాడు'లో 'పడమర కోటలో తాగు నీటికి కటకట' శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందించారు. సాయంత్రం ఇంజినీర్లతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఖిలా వరంగల్ కోటలో నీటిఎద్దడి తలెత్తకుండా శాశ్వత పనులు చేపట్టాలని కమిషనర్ కోరారు. వరంగల్, హనుమకొండ నగరాల ప్రజలకు నాణ్యమైన, స్వచ్ఛమైన నీటి సరఫరా లక్ష్యంగా పనిచేయాలన్నారు. విశ్రాంత ఆచార్య పాండురంగారావు కొన్ని సూచనలు చేశారు. సమావేశంలో ఎస్ఈ రాజ్‌కుమార్, ఈఈలు రవికుమార్, సంజయ్, మాధవి, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

## 'పెద్ది' చిత్రపటానికి కొవ్వొత్తులతో నివాళి

**నర్సంపేట, న్యూస్‌టుడే:** తెలంగాణ ఉద్యమకారుడు, దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మృతికి సంతాపంగా సోమవారం రాత్రి భారాస నాయకులు నర్సంపేటలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఆయన మృతిచెంది సోమవారానికి నెలరోజులు కాగా.. తెలంగాణ ఉద్యమకారులు, భారాస నాయకులు దార్ల రమాదేవి, గుంటి కిషన్, మచ్చిక నర్సయ్య ఆధ్వర్యంలో పలువురు నాయకులు నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. టి.సుదర్శన్, రవి, యాదగిరి, రవి, రాజు, సుధాకర్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సులు ఆపాలని వినతి

ఎంపీడీవో అద్వైతకు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచి రమేశ్

**ఖానాపురం, న్యూస్‌టుడే:** ఖానాపురం మండల కేంద్రంలోని రెండు బస్టాండ్‌లలో టీజీ ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సులను ఆపించేలా.. చర్యలు తీసుకోవాలని సోమవారం ప్రజావాణిలో ఎంపీడీవో అద్వైతకు స్థానిక సర్పంచి దాసరి రమేశ్ వినతిపత్రం అందజేశారు. మాజీ సర్పంచి రమేశ్, వార్డు సభ్యులు అజహర్, విజయ్, గ్రామస్థులు రామస్వామి, కుమార్ పాల్గొన్నారు. మండల పరిషత్తు కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో 16 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో అద్వైత తెలిపారు.

## ప్రజావాణిలో రెండు అర్జీలు

ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న అర్జీదారులు

**చెన్నారావుపేట, న్యూస్‌టుడే:** చెన్నారావుపేట మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో రెండు వినతులు వచ్చినట్లు ఎంపీడీవో వెంకట శివానంద్ తెలిపారు. 20 మంది అధికారులు పాల్గొన్నట్లు వెల్లడించారు. ఇప్పటి వరకు ఇందిరమ్మ ఇంటికి దరఖాస్తు చేసుకొని ఇద్దరు వ్యక్తులు వస్తే వాటిని వెంటనే ఆన్‌లైన్ చేసినట్లు పేర్కొన్నారు.

## ఎన్నికల హామీలను అమలు చేయాలి

సమావేశంలో బీఆర్‌టీయూ నాయకులు

**నర్సంపేట, న్యూస్‌టుడే:** ఎన్నికల సమయంలో సంఘటిత, అసంఘటిత కార్మికవర్గానికి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యువరాజు డిమాండ్ చేశారు. నర్సంపేటలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ సర్కార్ ఏర్పడి వేయిరోజులు గడిచినా.. ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీలకు, క్షేత్ర సహాయకులకు, మధ్యాహ్న భోజన కార్మికులకు, వీఓఏ, గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ కార్మికులు కనీస వేతనం రూ.18 వేలు ఇస్తామని చెప్పిన వాగ్దానాలు ఒక్కటీ అమలు కావడం లేదన్నారు. సంఘం నాయకులు రమేశ్, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, రవి పాల్గొన్నారు.

## 'ప్రైవేటు ఉపాధ్యాయులకూ అవార్డులు ఇవ్వాల్సిందే'

**దుగ్గొండి, న్యూస్‌టుడే:** ప్రభుత్వం ప్రైవేటు ఉపాధ్యాయులకు సైతం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందజేయాలని ప్రైవేటు ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధికార ప్రతినిధి సింగరబోయిన శ్రీశైలం అన్నారు. సోమవారం మండలంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ బడుల్లో మాదిరిగానే ప్రైవేటు పాఠశాలల్లో బోధన అందుతుందని, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత ఇద్దరికి ఒకే విధంగా ఉంటుందన్నారు. అలాంటప్పుడు గుర్తింపు విషయంలో వివక్ష తగదని అభిప్రాయపడ్డారు. వేణుగోపాల్, పరపల్లి సాంబయ్య, కొనుకటి రాజు తదితరులున్నారు.

## విద్యుత్తు సరఫరాలో నేడు అంతరాయం

**రంగశాయిపేట, న్యూస్‌టుడే:** మరమ్మతుల దృష్ట్యా కరీమాబాద్, జాన్‌పీరీలు ఉప కేంద్రాల పరిధిలో మంగళవారం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ ఎస్.మల్లికార్జున్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు రంగశాయిపేట, చెట్లోళ్లగడ్డ, ఎల్లమ్మతాళ్లు, రుద్రమంభ టీటీఆర్, నీటిట్యాంకు, ఎస్సీకాలనీ, వెంకటేశ్వర పాఠశాల, నానామియాతోట ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జాన్‌పీరీలు, జాన్‌పాక, ఇండస్ట్రియల్ ఏరియాలో అంతరాయం ఉంటుందన్నారు.

## ఇసుక ట్రాక్టర్లు సీజ్

**ఖిలావరంగల్:** అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సోమవారం మిల్స్‌కాలనీ పోలీసులు సీజ్ చేశారు. వర్ధన్నపేట ఆకేరువాగు నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా వరంగల్- ఖమ్మం జాతీయ రహదారి మీదుగా నగరానికి ఇసుక తీసుకొస్తున్న ట్రాక్టర్లను పెట్రోలింగ్ పోలీసులు అదుపులోకి తీసుకొని చోదకులపై కేసు నమోదు చేశారు.

## జూదరుల అరెస్టు

**నర్సంపేట గ్రామీణం:** లక్నేపల్లిలో జూద స్థావరంపై పోలీసులు సోమవారం దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకోగా ఒకరు పరారయ్యారు. రూ.5830 నగదు, అయిదు చరవాణులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై అరుణ్ తెలిపారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా సమస్త జనులకు తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ అయిన **మహమ్మద్ వహీద్ అలీ,** తండ్రి : మహమ్మద్ ముర్తుజా అలీ, నివాసము: వరంగల్లు గారు వరంగల్లు జిల్లా ఖిలా వరంగల్లు మండలం, ఖిలా వరంగల్లు గ్రామంలోని **సర్వే నెంబర్లు 1123/A మరియు 1123/B లో 195.00 చ.గజముల ఖాళీ** స్థలమును అనగా ఇందు షెడ్యూల్ దాఖలా గల ఆస్తిని ఇష్రత్ సుల్తానా, భర్త : మహమ్మద్ మోయిన్ పాషా, నివాసము: L.B నగర్, వరంగల్లు గారి నుండి కొనుగోలు చేయుటకు అంగీకరించి విక్రయ అగ్రిమెంట్ ఏర్పర్చుకోనైనది. కావున ఇందు షెడ్యూల్ దాఖల గల ఆస్తిపై ఎవరికి గాని ఎలాంటి అభ్యంతరములు, ఆక్షేపణలు ఉన్నచో ఈ దిగువ అడ్రసుకు 7 రోజుల లోపు తగిన సాక్ష్యాధారాలతో రాగలరు. లేనిచో ఇందు షెడ్యూల్ దాఖలా గల ఆస్తిపై ఎవరికి ఎలాంటి అభ్యంతరములు, ఆక్షేపణలు లేవని భావించి నా క్లయింటు రిజిస్ట్రేషన్ చేయించుకొనగలడు. గడువు తదుపరి వచ్చు ఆక్షేపణలు, అభ్యంతరములు పరిగణలోనికి తీసుకోనబడవు.

షెడ్యూల్: వరంగల్లు జిల్లా, ఖిలా వరంగల్లు మండలం, ఖిలా వరంగల్లు గ్రామంలోని సర్వే నెంబర్లు 1123/A మరియు 1123/B లో 195.00 చ.గజముల ఖాళీ స్థలమును ఈ దిగువ హద్దులలో గలది.
**తూర్పు:** 15'-0" రోడ్డు, **పడమర:** 16'-0" రోడ్డు,
**ఉత్తరం:** ఇ.నెం.19-10-350/3 Md.సాదిక్ గారి ఇల్లు & ఇ.నెం.19-10-350/2 రాంచందర్ గారి ఇల్లు,
**దక్షిణం:** గవర్నమెంట్ స్కూల్

Sd/- తాబేటి శ్రీధర్
అడ్వకేట్
H.No : 11-29-300, Second Bank Colony, Warangal, Cell No : 9397398011.

LIC 70వ వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు
జిల్లా ప్రజలకు, పాలసీదారులకు, ఏజెంట్ మిత్రులకు, ఆఫీస్ సిబ్బందికి, మిత్రులకు & శ్రేయోభిలాషులకు LIC 70వ వార్షికోత్సవ శుభాకాంక్షలు...
ANISHETTY RAJU
M.Sc., Computers, LL.B.
Development Officer
Hanamkonda Branch, Warangal Division
H.No. 5-11-1072, Pochammakunta, Hanamkonda
Cell: 9347105181
email: rajuanishetty@gmail.com

LIC 70వ వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు
పాలసీదారులకు, ఏజెంట్ మిత్రులకు మరియు ఆఫీస్ సిబ్బందికి, శ్రేయోభిలాషులకు LIC 70వ వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు...
KADARI PRATHIMA
8519894811
Insurance Professional Advisor
District Branch Office
15-1-422/ A & B, 1st Floor
S.V.P. Main Road, Near Industrial Estate, Warangal

IndianOil Formation Day
వరంగల్ జిల్లా ప్రజలకు, కస్టమర్లకు, మిత్రులకు మరియు శ్రేయోభిలాషులకు ఇండియన్‌ఆయిల్ దినోత్సవ శుభాకాంక్షలు..
దుర్గ ఫ్యూయల్ పాయింట్
బొల్లికుంట గ్రామం, ఖిలా వరంగల్ మండలం, వరంగల్ జిల్లా

IndianOil Formation Day
వరంగల్ జిల్లా ప్రజలకు, కస్టమర్లకు మిత్రులకు మరియు శ్రేయోభిలాషులకు ఇండియన్‌ఆయిల్ దినోత్సవ శుభాకాంక్షలు..
Prop. K.Anil Kumar
SAI SERVICE STATION
మెయిన్ రోడ్ ఎల్కతుర్తి (గ్రామం & మం॥), హనుమకొండ జిల్లా

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 8008001791
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 8008014568

(c) eenadu